




# కరపత్రం

SINCE 2014

సోమవారం జూన్ 08, 2026 | సంపుటి : 2 | సంచిక : 237 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4


## మెట్రో విస్తరణను కేంద్ర మంత్రే అడ్డుకుంటున్నారు

### ఓ కేంద్ర మంత్రి ఢిల్లీలో అడ్డుకుంటున్నారని వ్యాఖ్య
### మెట్రో అనుమతులపై కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్

- మూసీ ప్రక్షాళనను భాజపా వ్యతిరేకిస్తోందని విమర్శ
- ఆర్ఆర్ఆర్, ధాన్యం కొనుగోళ్లపై కేంద్రాన్ని ప్రశ్నించారు
- జీహెచ్ఎంసీ విభజన ప్రజల సౌలభ్యం కోసమేనన్నారు
- మల్కాజిగిరి అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెడతానని హామీ
- క్యూర్-1 యాప్‌ను సీఎం ఆవిష్కరించారు.



**ఉప్పల్:**
హైదరాబాద్ మెట్రో విస్తరణకు ప్రతిపాదనలు పంపితే కేంద్రం ఆమోదించడం లేదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. కేంద్రమంత్రిగా ఉన్న ఓ నేత మెట్రో విస్తరణను దిల్లీలో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి భాజపాలోనే ఉండి.. కేటీఆర్‌కు సహకరిస్తారని ఆ పార్టీ నేతలే చెబుతున్నారన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా.. ప్రజల కోసం పనిచేస్తానని, ఇతర పార్టీలకు కాదని వ్యాఖ్యానించారు. మెట్రోకు ఎందుకు అనుమతులు రావడం లేదో కిషన్‌రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. ఉప్పల్ భగాయత్ వేదికగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం ముఖ్యమంత్రి ఈమేరకు ప్రసంగించారు. ఎన్నికలు ఉన్నప్పుడే రాజకీయాలు చేయాలన్నారు. "గుజరాత్‌లో సబర్మతి రివర్‌ఫ్రంట్, దిల్లీలో యమునా రివర్‌ఫ్రంట్ అభివృద్ధి చేసుకున్నారు. యూపీలో గంగానది ప్రక్షాళన చేశామని అక్కడి సీఎం యోగి చెప్పుకొన్నారు. ప్రధాని మోదీ నదులను ప్రక్షాళన చేశారని భాజపా నేతలు గొప్పగా చెప్పుకొంటున్నారు. మూసీ ప్రక్షాళనను మాత్రం వ్యతిరేకిస్తున్నారు. ఈ నెల 15 తర్వాత మా కార్యాచరణ మారుతుంది. మెట్రో విస్తరణకు ఎందుకు అనుమతి ఇవ్వరో.. రాష్ట్రంలో మొత్తం ధాన్యాన్ని ఎందుకు కొనరో.. ఆర్ఆర్ఆర్‌కు నిధులు ఎందుకు ఇవ్వరో.. మూసీ ప్రక్షాళనను ఎందుకు అడ్డుకుంటారో చూస్తాం. మంచి పనుల విషయంలో రాజకీయాలు చేయొద్దు. ఓఆర్ఆర్ లోపలే దాదాపు 1.34 కోట్ల మంది ప్రజలు ఉన్నారు. ఈ స్థాయి జనాభాకు సదుపాయాలు కల్పించడమంటే ఆషామాషీ కాదు. పరిపాలన సౌలభ్యం కోసమే జీహెచ్ఎంసీని మూడుగా విభజించాం. కానీ.. రాజకీయ లబ్ధి కోసమే విభజించామని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజల సౌలభ్యం కోసం ఉప్పల్‌లోనే మున్సిపల్ ఆఫీసు ఏర్పాటు చేస్తున్నాం. రాజకీయంగా కిందపడిన నన్ను మళ్లీ నిలబెట్టింది మల్కాజిగిరి ప్రజలే. కేంద్రం సహకారం లేకపోవడంతో అప్పుడు ఎంపీగా అనుకున్న పనులు చేయలేకపోయాను. ఇప్పుడు ముఖ్యమంత్రిగా మల్కాజిగిరిని అభివృద్ధి చేసే బాధ్యత తీసుకున్నాను" అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

**క్యూర్ యాప్ ఆవిష్కరణ**

ముఖ్యమంత్రి శంకుస్థాపన చేసిన వాటిలో.. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ భవన నిర్మాణం, ఉప్పల్‌లో వంద పడకల ఏరియా ఆసుపత్రి నిర్మాణం, ఏవోసీ సెంటర్ చుట్టూ ప్రత్యామ్నాయ రోడ్ల నిర్మాణాలు వంటివి ఉన్నాయి. అదేవిధంగా క్యూర్-1 మొబైల్ యాప్‌ను సీఎం ఆవిష్కరించారు. ఈ యాప్ ద్వారా ఆస్తి పన్ను, విద్యుత్, నీటి బిల్లులు చెల్లించే అవకాశం కల్పించారు.

## నీట్ పరీక్ష..
### అందుబాటులోకి సిటీ ఇంటిమేషన్ స్లిప్‌లు




నీట్-యూజీ రీ-ఎగ్జామినేషన్‌కు సంబంధించి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) కీలక అప్‌డేట్ ఇచ్చింది. అభ్యర్థులకు కేటాయించిన పరీక్షా కేంద్రం ఏ నగరంలో ఉందనే సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ప్రకటించింది. అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్ సాయంతో లాగిన్ కావడం ద్వారా ఈ వివరాలు పొందవచ్చని తెలిపింది. పేపర్ లీక్ ఆరోపణలతో మే 3న నిర్వహించిన నీటి-యూజీ పరీక్షను ఎన్‌టీఏ రద్దు చేసిన విషయం తెలిసిందే. జూన్ 21న మరోసారి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈసారి కూడా పెన్-పేపర్ విధానంలోనే పరీక్ష ఉంటుందని ఇప్పటికే స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లో 14 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించనున్నారు. మరోవైపు నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై సీబీఐ ప్రస్తుతం దర్యాప్తు కొనసాగిస్తోంది.




### కేపీహెచ్‌బీలో పబ్‌పై రైడ్.. పోలీసుల అదుపులో 9 మంది

**హైదరాబాద్:**
కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ పబ్బులో కూకట్‌పల్లి డీసీపీ ఆధ్వర్యంలో పోలీసులు అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. నిర్ణీత సమయం దాటిన తర్వాత కూడా కింగ్స్ & క్వీన్స్ పబ్బు నిర్వహిస్తున్నట్లు గుర్తించి చర్యలు చేపట్టారు. అక్కడ ఉన్న 9 మందిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ హెచ్చరించారు.

## సత్యసాయి జిల్లాలో వందేభారత్‌కు తప్పిన ప్రమాదం



హిందూపురం పట్టణం: ఏపీలోని సత్యసాయి జిల్లాలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రమాదం తప్పింది. హిందూపురం రైల్వేస్టేషన్ వద్ద రెండు ఆవులను వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొంది. కాచిగూడ నుంచి బెంగళూరుకు వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. పెద్దశబ్దం రావడంతో రైలును లోకోపైలట్ నిలిపేశారు. ఏం జరిగిందో తెలియక ప్రయాణికులు కాసేపు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని రైలును క్షుణ్ణంగా పరిశీలించారు. ఆవుల కళేబరాలను పట్టాల పైనుంచి తొలగించారు. రైలు సురక్షితంగా ఉందని నిర్ధారించి ముందుకు వెళ్లేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దాదాపు అరగంట అనంతరం వందేభారత్ తిరిగి తన ప్రయాణాన్ని కొనసాగించింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగలేదు.

2లో




### ఇందిరా పార్క్ వద్ద యువ క్రికెటర్ల ధర్నా

హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద "తెలంగాణ క్రికెట్ కోసం ప్రజా ఉద్యమం" పేరుతో నిర్వహించిన ధర్నాలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నేతలు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ పై పలు ఆరోపణలు చేశారు. టీసీఏ కార్యదర్శి గురువా రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ జిల్లాల క్రికెటర్లకు హెచ్‌సీఏలో సరైన అవకాశాలు లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

### ఏ అంశం మీద చర్చ పెట్టినా సిద్ధమే..
## సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి సవాల్

- » రేవంత్ వ్యాఖ్యలను ఖండించిన కేంద్ర మంత్రి
- » "నేను పార్టీలు మారలేదు"
- » "భాజపాలోనే పుట్టుక.. చావు"
- » తెలంగాణ ప్రజలకు తన గురించి తెలుసన్నారు
- » ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్
- » దళిత, బీసీ హామీలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు
- » "అన్నింటికీ సమయమే సమాధానం" అన్నారు.



**హైదరాబాద్:**
ఏ అంశం మీద ఎక్కడ చర్చ పెట్టినా తాను సిద్ధమేనని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఆయన తాటాకు చప్పుళ్లకు ఎవరూ భయపడరన్నారు. పొలిమేరకు రాకుండా తనను ఆపేవారు తెలంగాణలో ఇంకా పుట్టలేదని వ్యాఖ్యానించారు. "రేవంత్‌రెడ్డిలా నేను పది పార్టీలు మారలేదు. నా పుట్టుక.. చావు.. రెండూ భాజపాలోనే. నేనేంటో తెలంగాణ ప్రజలకు తెలుసు. ఎంత రెచ్చగొట్టినా తొందరపడను. అన్నింటికీ సమయమే సమాధానం చెబుతుంది. ముందు తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చండి. దళితులు, బీసీలు మీ ఇంటికి వచ్చి ధర్నాలు చేస్తారు" అని కిషన్‌రెడ్డి అన్నారు.



2లో..

## రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా గెలిచేది కాంగ్రెస్సే: ఆది శ్రీనివాస్

- ఏ ఎన్నికలు వచ్చినా గెలిచేది కాంగ్రెస్‌నే: ఆది శ్రీనివాస్
- కవిత వ్యాఖ్యలను ఖండించిన ప్రభుత్వ విప్
- పవన్ భూములపై ఆధారాలు ఉంటే ఇవ్వాలని సవాల్
- హైడ్రాతో రూ.50 వేల కోట్ల ప్రభుత్వ భూములు రక్షించామన్నారు
- బీఆర్ఎస్ భూ కబ్జాలకు ప్రోత్సాహం ని ఇచ్చిందని ఆరోపణ
- కేటీఆర్, హరీశ్‌రావుపై భూ కబ్జాల ఆరోపణలు
- బీఆర్ఎస్‌కు ప్రజాదరణ లేకనే విమర్శలు చేస్తున్నారని వ్యాఖ్య

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నాం: హరీశ్‌రావు

**హైదరాబాద్:**
గతంలో కృష్ణా, ఇప్పుడు గోదావరి నీటిని మళ్లించేందుకు తెలంగాణను మోసం చేస్తున్నారని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. గోదావరి-కావేరి అనుసంధానం పేరుతో ఏపీ ప్రభుత్వం నదీ జలాల తరలింపునకు మరోసారి ప్రయత్నిస్తోందన్నారు.



2లో..

## హిట్లర్, తుగ్లక్ కలిస్తే ఆయనే..

- రాష్ట్రంలో అసమర్థ పాలన కొనసాగుతోందని విమర్శ
- కాంగ్రెస్ అధిష్ఠానానికి గులాంగిరీ చేస్తున్నారని ఆరోపణ
- ఎఫ్‌సీఐ ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణదే కీలక పాత్ర అన్నారు
- 11 ఏళ్లలో కేంద్రం రూ.13 లక్షల కోట్లు కేటాయించిందని వ్యాఖ్య
- తెలంగాణ పన్నుల్లో 80% కేంద్రం తిరిగి ఇచ్చిందన్నారు
- సోనియా కుటుంబం ముందు రేవంత్ తలవంచుతున్నారని విమర్శ
- పదవి కోసం అధిష్ఠానాన్ని ప్రసన్నం చేసుకుంటున్నారని ఆరోపణ.



**హైదరాబాద్:**
హిట్లర్, తుగ్లక్ కలిస్తే రేవంత్ రెడ్డి అంటూ తెలంగాణ ముఖ్యమంత్రిపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ఢిల్లీలోని కాంగ్రెస్ అధిష్ఠానానికి గులాంగిరీ చేస్తున్నారని చెప్పారు. 'సాక్షి'తో మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... దేశంలో తెలంగాణ నుంచే ఎఫ్‌సీఐ 60 శాతం ధాన్యం కొనుగోలు చేస్తోందని తెలిపారు. "హిట్లర్ ప్లస్ తుగ్లక్ కలిస్తే రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి నేతృత్వంలో అసమర్థ పాలన కొనసాగుతోంది. సోనియా గాంధీ కుటుంబానికి సలాం చేసేది రేవంత్ రెడ్డి. పదవి కాపాడుకోవడానికి సోనియాకు పన్నులు కడుతున్నారు. 11 ఏళ్లలో కేంద్రం తెలంగాణకు రూ.13 లక్షల కోట్లు కేటాయించింది. తెలంగాణ కట్టిన పన్నుల్లో 80 శాతం కేంద్ర ప్రభుత్వం తిరిగి ఇచ్చింది. సోనియా కుటుంబం ముందుకు రేవంత్ రెడ్డి గులాంగిరి చేస్తున్నారు" అని చెప్పారు.

## భార్య, అత్తామామల దాడి.. ఆర్మీ ఉద్యోగి మృతి



**మెదక్:**
పట్టణంలోని మిలిటరీ కాలనీలో ఆర్మీ ఉద్యోగి హత్యకు గురయ్యాడు. ఆర్మీలో సుబేదార్‌గా ఉన్న పొన్నం కుమార్‌గౌడ్ (49)ను అతడి భార్య, అత్తామామలే అంతమొందించారు. ఉత్తరాఖండ్‌లో విధులు నిర్వహిస్తున్న కుమార్‌గౌడ్.. సెలవులపై నెలక్రితం ఇంటికి వచ్చాడు. 15 రోజుల క్రితం భార్య పద్మతో గొడవపడ్డాడు. దీంతో ఆమె పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయారు. ఈ క్రమంలో కుమార్ ఇద్దరు మహిళలను ఇంటికి తీసుకొచ్చాడనే ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయం తెలుసుకున్న అతడి భార్య.. పుట్టింటి నుంచి తిరిగివచ్చారు. అర్ధరాత్రి కుమార్‌పై భార్య, అత్తామామ, బావమరిది కలిసి దాడి చేశారు. దీంతో అతడు ప్రాణాలు కోల్పోయాడు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగింపు



మిగతాది 2లో

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జూన్ 08, 2026

## ఇందిరా పార్క్ వద్ద యువ క్రికెటర్ల ధర్నా

మొదటిపేజీ తరువాయి

గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే ప్రతిభావంతులైన ఆటగాళ్లు హెచ్‌సీఏ వ్యవస్థ కారణంగా నష్టపోతున్నారని ఆరోపించారు.
ప్రత్యేక తెలంగాణ డిస్ట్రిక్ట్ క్రికెట్ అసోసియేషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలు, మండలాల స్థాయిలో ఇతర క్రీడలకు ఉన్నట్లుగా క్రికెట్‌కు కూడా ప్రత్యేక వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. బీసీసీఐ టోర్నమెంట్లలో ఆడాలంటే హెచ్‌సీఏ పరిధిలోనే ఉండాల్సిన పరిస్థితి జిల్లాల ఆటగాళ్లకు ఇబ్బందిగా మారిందన్నారు.
హెచ్‌సీఏలో అవినీతి, అక్రమాలు జరిగాయని, ఎంపికల ప్రక్రియలో పారదర్శకత లేదని టీసీఏ నేతలు ఆరోపించారు. క్లబ్‌ల నమోదు, ఎన్నికలు, ఆర్థిక వ్యవహారాలు, క్రీడాకారుల ఎంపికలో పలు అక్రమాలు జరిగాయని వారు పేర్కొన్నారు. హెచ్‌సీఏలో కోట్ల రూపాయల అవినీతి జరిగిందని, దీనిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.
అలాగే హెచ్‌సీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లీగ్‌లకు సంబంధించిన అనుమతులు, క్లబ్‌ల చట్టబద్ధత, పాలకవర్గ నియామకాలపై కూడా టీసీఏ నేతలు ప్రశ్నలు లేవనెత్తారు. గతంలో సమర్పించిన ఫిర్యాదులపై ప్రభుత్వం, దర్యాప్తు సంస్థలు చర్యలు తీసుకోవాలని కోరారు.
గ్రామీణ, జిల్లా స్థాయి ఆటగాళ్ల భవిష్యత్తు దృష్ట్యా ప్రభుత్వం జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులపై విచారణ జరిపి అవసరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగి

మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో స్కూళ్లకు వేసవి సెలవులు పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ నెల 14వ తేదీ వరకు సెలవులను విద్యాశాఖ పొడిగించింది. ఈ నెల 15న పాఠశాలల పునఃప్రారంభం కానున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎండ తీవ్రత కొనసాగుతున్న నేపథ్యంలో పాఠశాలలకు వేసవి సెలవులను ప్రభుత్వం పొడిగించింది.
తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ఇంకా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు. సెలవులను పొడిగించడం వల్ల విద్యార్థులు తీవ్రమైన వేసవి ఎండల బారిన పడకూడదని అధికారులు ఈ నిర్ణయం తీసకున్నారు. పాఠశాలలు పునఃప్రారంభమవడానికి ముందు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని యాజమాన్యాలకు ప్రభుత్వం సూచించింది.

## రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా గెలిచేది కాంగ్రెస్సే: ఆది శ్రీనివాస్

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాదని కవిత అంటున్నారని, కానీ.. రాష్ట్రంలో ఏ ఎన్నికలు వచ్చినా తామే గెలుస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్ కల్యాణ్‌కు సంబంధించిన భూములపై కవిత దగ్గర ఆధారాలుంటే ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, ఆ మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. హైడ్రా ద్వారా రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కాపాడామని తెలిపారు.
"బీఆర్ఎస్ ప్రభుత్వం భూ కబ్జాలకు ద్వారాలు తెరిచి అవినీతి చేసింది. వాటిపై కవిత మాట్లాడాలి. కేటీఆర్, హరీశ్ రావు భూ కబ్జాలకు పాల్పడి బినామీల పేరిట వాటిని మార్చిన విషయం ఆమెకు తెలుసు. టీఆర్ఎస్‌కు ప్రజల్లో ఆదరణ లేకపోవడంతోనే అసత్య ఆరోపణలు చేస్తూ కాలం వెల్లదీస్తున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్లు ఆధారాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలి" అని ఆది శ్రీనివాస్ చెప్పారు.

## కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నాం: హరీశ్‌రావు

మొదటిపేజీ తరువాయి

ఈ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రలేపే ప్రయత్నం చేస్తున్నామన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు."గోదావరిలో సర్‌ప్లస్ వాటర్ లేదు. సర్‌ప్లస్ వాటర్ లేదని కేంద్రం చెప్పిన మాటనే బీఆర్ఎస్ పార్టీ బయటపెట్టింది. సమ్మక్కసాగర్, నాగార్జునసాగర్.. సోమశిల నుంచి కావేరీ గత ప్రతిపాదన. తెలంగాణ భూభాగమే టచ్ చేయకుండా ఏపీ ప్రభుత్వం నదుల అనుసంధానం చేస్తోంది. పోలవరం నుంచి నల్లమల సాగర్.. అక్కడి నుంచి కావేరీ అనుసంధానం చేయాలని ఏపీ ప్రతిపాదన. కేంద్ర ప్రభుత్వ నిధులతో మళ్లించుకునేందుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఇదే జరిగితే.. తెలంగాణకు ఒక్క చుక్క నీరు కూడా రాదు, జాతీయ ప్రాజెక్టు రాదు. గోదావరి-బనకచర్లను మొదట బయటపెట్టిందే బీఆర్ఎస్ పార్టీ. దీనిపై ప్రశ్నించింది కూడా మా పార్టీయే" అని హరీశ్‌రావు అన్నారు.

## డిఎస్సీపై వైసిపి రాజకీయం తప్పు జరిగినట్లుగా దుష్ప్రచారం

### - మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం

వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఎస్సీపై జగన్ అండ్ కో అసత్య ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. డీఎస్సీపై రాజకీయం చేసి ఎక్కడో తప్పు జరిగినట్లుగా ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహించారు. శనివారం అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండపల్లితో పాటు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొన్నారు. 82 మందికి రూ.4.86 కోట్ల విలువ చేసే ఎంఎస్ఎం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. తమ ప్రభుత్వం డీఎస్సీ ద్వారా 16 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని తెలిపారు. డీఎస్సీపై ఆరోపణలు చేసిన వారిపై అధికారులు విశ్లేషణ చేశారని.. కొంతమందికి ఎందుకు ఉద్యోగం రాలేదో వివరించారని అన్నారు. వైసీపీ నేతలు తప్పుడు సందేహాలు క్రియేట్ చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని దుయ్యబట్టారు. జగన్‌కు ఐదేళ్ల సమయం ప్రజలు ఇచ్చారని.. వారి హయాంలో జనం కోసం ఏమి చేయలేకపోయారని మండిపడ్డారు. బటన్ నొక్కితే చాలనే ఆలోచనతోనే జగన్ పని చేశారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వంలో రెండేళ్లలో జరిగిన అభివృద్ధి.. వైసీపీ హయాంలోని ఐదేళ్లలో ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు.

## పోలీసులకు లొంగిపోయిన సిఐ చినమల్లయ్య

అత్యాచారం కేసులో గత కొన్ని వారాలుగా పరారీలో ఉన్న సీఐ చినమల్లయ్య ఎట్టకేలకు శనివారం తెల్లవారుజామున సుమారు 5 గంటల ప్రాంతంలో వినుకొండ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అధికారుల ముందు లొంగిపోయారు. తనపై సీఐ చినమల్లయ్య అత్యాచారం చేశాడంటూ.. ఏప్రిల్ 29న ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయనపై కేసు నమోదైంది. నాటి నుంచి అరెస్ట్ భయంతో అజ్ఞాతంలోకి వెళ్లిన చినమల్లయ్య, పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటూనే ముందస్తు బెయిల్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే, ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను అటు ఆంధ్రప్రదేశ్ హైకోర్టుతో పాటు, ఇటు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు కూడా కొట్టివేయడంతో ఆయనకు చట్టపరంగా ఎలాంటి ఊరట లభించలేదు. అన్ని కోర్టుల్లోనూ పిటిషన్లు తిరస్కరణకు గురికావడంతో అరెస్ట్ తప్పదని భావించిన చినమల్లయ్య, చివరికి వినుకొండ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ప్రస్తుతం ఆయనను అదుపులోకి తీసుకున్న పోలీసులు తదుపరి విచారణ జరుపుతున్నారు.

## కరీంనగర్‌లో కూలిన లిఫ్ట్ ఎమ్మెల్యే కవ్వంపల్లికి తప్పిన ప్రాణాపాయం

మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణకు పెను ప్రమాదం తప్పింది. మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్ జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు కరీంనగర్‌కు ఎమ్మెల్యే వెళ్లారు. అయితే, కెమిస్ట్ భవన్ రెండో అంతస్తు నుంచి దిగుతూ లిఫ్ట్ ప్రమాదానికి గురైంది. సాంకేతిక కారణాల వల్ల లిఫ్ట్ ఒక్కసారిగా రెండో అంతస్తు నుంచి గ్రౌండ్ ఫ్లోర్‌కు పడిపోయింది. ప్రమాద సమయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లితో పాటు లిఫ్ట్‌లో మరో ఆరుగురు ఉన్నారు. ఏం జరుగుతుందో అర్థం కాక వారంతా తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సిబ్బంది వెంటనే స్పందించడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడటంతో వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరోవైపు, ఎమ్మెల్యే కవ్వంపల్లి లిఫ్ట్ ప్రమాదానికి గురయ్యారని తెలుసుకున్న నియోజకవర్గ ప్రజలు, ఆయన అభిమానులు ఆందోళన చెందారు.

## ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం అకాల్ తఖ్త్ వద్ద ఖలిస్తాన్ అనుకూల నినాదాలు

పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఉన్న ప్రముఖ సిక్కు మత కేంద్రం అకాల్ తఖ్త్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. ఆపరేషన్ బ్లూ స్టార్ 42వ వార్షికోత్సవం సందర్భంగా ఖలిస్థాన్ అనుకూల నినాదాలు వినిపించాయి. సిక్కు మిలిటెంట్ నాయకుడు జర్నైల్ సింగ్ భింద్రాన్‌వాలే పోస్టర్లు వెలిశాయి. జూన్ 6, 1984న భారత సైన్యం నిర్వహించిన ఆపరేషన్ బ్లూ స్టార్‌లో భింద్రన్‌వాలే మరణించారు.ప్రతి ఏటా
జూన్ 6వ తేదీన సిక్కు సమాజంలోని కొన్ని వర్గాలు 'ఘల్లోఘారా దివస్'గా పాటిస్తాయి. ఈ ఏడాది కూడా భింద్రన్ వాలేను స్మరించుకుంటూ కొందరు కార్యకర్తలు నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో శాంతి భద్రతలను కాపాడేందుకు పంజాబ్ పోలీసులు అమృత్‌సర్, దాని పరిసర ప్రాంతాలలో విస్తృతమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు. శాంతిభద్రతల ప్రత్యేక డైరెక్టర్ జనరల్ ప్రవీణ్ కుమార్ సిన్హా జూన్ 4న జిల్లాలో పర్యటించి, బలగాల మోహరింపును సమీక్షించారు. దాదాపు 4,000 మంది పోలీసు సిబ్బందిని రక్షణ కార్యక్రమాల్లో భాగం చేశారు. కాగా, భింద్రన్‌వాలేను సిక్కు సమాజంలోని కొంతమంది అమరవీరుడిగా భావిస్తే, మరికొందరు ఆయనను పంజాబ్‌లో తీవ్రవాద ఉద్యమానికి ప్రతీకగా చూస్తారు.

## పంజాబ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం ఎదురెదురుగా ఢీకొన్న ట్రక్కులు

**8మంది ప్రయాణికుల దుర్మరణం**

పంజాబ్‌లోని ఫిరోజ్‌పూర్-ఫాజిల్కా రహదారిపై శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొని 8మంది ప్రాణాలు కోల్పోగా.. 15మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులంతా ఇటీవల మృతిచెందిన తమ బంధువు అస్థికలను నీటిలో కలిపేందుకు వెళ్తుండగా ఈ ఘోరం జరిగింది. ప్రమాదానికి గురైన వారిని జలాలాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు. బాధితులు తమ బంధువు అస్థికలను తీసుకుని బియాస్‌లోని రాధా సోమీ డేరాకు శనివారం ఉదయం ప్రయాణం మొదలుపెట్టారు. సుమారు 25 మంది మహీంద్రా పికప్ వాహనంలో బయలుదేరారు. అయితే, వాహనం జంగవాలా గ్రామ సమీపానికి రాగానే ఎదురుగా వచ్చిన మరో ట్రక్కును ప్రమాదవశాత్తూ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మరణించగా.. మరో నలుగురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, వైద్య సిబ్బంది
ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని ఫిరోజ్‌పూర్‌లోని సివిల్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. కుటుంబ సభ్యులు, బంధువుల మృతితో ప్రమాద స్థలం, ఆస్పత్రి ప్రాంగణంలో బాధితుల రోదనలు మిన్నంటాయి. మరోవైపు ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన తీరుపై ఆరా తీస్తున్నారు.

## అదో మురికి కీటకం..పేరు మార్చుకోండి! - కాక్రోచ్ పార్టీపై హరియాణా మంత్రి



'కాక్రోచ్ జనతా పార్టీ'పై హరియాణా మంత్రి అనిల్ విజ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ పోరాటం చేసే హక్కు ఉందన్నారు. అయితే, బొద్దింక ఓ మురికి కీటకమని, దాన్ని ఓ చిన్న పిల్లాడు కూడా కాలితో నలిపేయగలడని అన్నారు. అందుకే పేరు మార్చుకోవాలని ఆ పార్టీకి సూచించారు.

**యువత ప్రశ్నించాల్సిందే - అభిజీత్**

పరీక్షల నిర్వహణలో లోపాలకు కారణమైన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను రాజీనామా చేయించే బాధ్యత ప్రధాని మోదీదేనని కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే పేర్కొన్నారు. స్వస్థలం శంభాజీనగర్‌లో విలేకరులతో మాట్లాడిన ఆయన.. పేపర్ లీకేజీలపై ప్రశ్నించాల్సిన అవసరం ఉందన్నారు. ఐదేళ్లకు ఓసారి ఓటు వేయడం మాత్రమే రాజకీయం కాదని, ఎవరికి ఓటు వేశామో వారిని ప్రశ్నించాలన్నారు. యువత గళం విప్పినప్పుడే వ్యవస్థ సరిగ్గా పని చేస్తుందన్నారు.

## భువనగిరి మార్కెట్‌లో జంక్షన్ బాక్సుల ధ్వంసం విలువైన వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లిన దొంగలు

యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో భారీ చోరీ ఘటన వెలుగు చూసింది. గుర్తు తెలియని దుండగులు రాత్రి వేళ మార్కెట్ ప్రాంగణంలోకి ప్రవేశించి విద్యుత్ వ్యవస్థకు సంబంధించిన జంక్షన్ బాక్స్‌లను ధ్వంసం చేసి సుమారు రూ.25 లక్షల విలువ గల విద్యుత్ వైర్లను శుక్రవారం రాత్రి ఎత్తుకెళ్లినట్లు అధికారులు తెలిపారు. సమాచారం ప్రకారం ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన విద్యుత్ సరఫరా వ్యవస్థలో భాగంగా ఉన్న జంక్షన్ బాక్స్‌లను దుండగులు లక్ష్యంగా చేసుకున్నారు. ముందుగా విద్యుత్ కనెక్షన్లను ధ్వంసం చేసి, విద్యుత్ వైర్లను కత్తిరించి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. శనివారం ఉదయం విధులకు వచ్చిన సిబ్బంది జంక్షన్ బాక్స్‌లు ధ్వంసమై ఉండడాన్ని గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అధికారులు ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.25 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో విద్యుత్ సరఫరా వ్యవస్థకు అంతరాయంతో పాటు ప్రభుత్వ ఆస్తికి భారీ నష్టం సంభవించిందని తెలిపారు. ఇంత పెద్ద మొత్తంలో విద్యుత్ వైర్లు చోరీ కావడం స్థానికంగా సంచలనం రేపింది. మార్కెట్ వంటి కీలక ప్రభుత్వ ప్రాంగణంలో భద్రతా లోపాలు ఎలా చోటు చేసుకున్నాయనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రాత్రి వేళల్లో నిఘా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, భద్రతా సిబ్బంది విధులపై కూడా
అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఘటనపై మార్కెట్ అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. చోరీ జరిగిన ప్రాంతంలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తూ దుండగుల ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. నేరంలో పాల్గొన్న వారిని త్వరలోనే గుర్తించి చట్టపరమైన తీసుకుంటామని పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ వంటి ప్రధాన కేంద్రాల్లో రాత్రి వేళల్లో నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులకు బుద్ధి

### సొంతింటిని వృద్ధులకు అప్పగించిన అధికారులు

వృద్ధ తల్లిదండ్రులను దూరం కొట్టిన కొడుకులకు కలెక్టర్ గట్టి బుద్ధి చెప్పారు. వారి ఇంటిని వారికి స్వాధీనం చేయించారు. వివరాల్లోకి వెళితే..నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలో గల హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన ఇంజం చంద్రకళ భర్త రమణారెడ్డి(70) వయోవృద్ధులు. వీరికి ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె ఉంది. వారి విద్యాభ్యాసం, పెళ్లిళు వంటి బాధ్యతలు అన్ని నిర్వర్తించడం జరిగింది. వీరికి సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఇంజంవారిగూడెంలో వ్యవసాయ భూమి, మిర్యాలగూడ పట్టణంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఓ ఇళ్లు కలదు. వీరి పేరు మీద ఉన్నటువంటి ఇంటిలో కుమారుడు గత ఐదేండ్లుగా నివాసం ఉంటూ తల్లిదండ్రులను రానివ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. పక్షవాతం, మోకాళ్ల ఆపరేషన్, ఇతర అనారోగ్య సమస్యలతో సతమతమవుతున్న వయోవృద్ధులు ఆర్డీఓ ట్రిబ్యునల్ అలాగే అప్పిలేట్ ట్రిబ్యునల్, సీనియర్ సిటిజెన్స్ చట్టాన్ని ఆశ్రయించడంతో వయోవృద్ధుల చట్టం 2007ను అనుసరించి జిల్లా కలెక్టర్ గత నెల 15వ తేదీన సదరు ఆస్తిని వారికి స్వాధీనపరచాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు పరచాల్సిందిగా ఆర్డీఓ ఎస్.రమణారెడ్డి వివిధ డిపార్ట్‌మెంట్ల సమన్వయంతో జరపాలని గత 23వ తేదీ ఉత్తర్వులు ఇవ్వడంతో ఉత్తర్వుల అమలులో భాగంగా మున్సిపల్ కమిషనర్ నర్రా శ్రీజా రెడ్డి, స్థానిక సీఐ నాగభూషణం, తాసీల్దార్ సిబ్బంది, రెవెన్యూ, మహిళా శిశు, దివ్యాంగుల వయో వృద్ధుల శాఖ అందరు కలిసి ఆ వయో వృద్ధులను శనివారం వారి ఇంటిలోకి చేర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది సైదులు, అనిల్ కుమార్, గోపమ్మ, మున్సిపల్ సిబ్బంది సాజిద్, సాంబయ్య, రెవెన్యూ శాఖ నుండి రాజు, ఆర్ఐ, సిడిపిఓ కార్యాలయం నుండి రాములు గారు నాగిరెడ్డి నవీన్ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యం

### ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో వార్డు సభల నిర్వహణ

**నల్లగొండ మున్సిపల్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర**

ప్రజల భాగస్వామ్యంతోనే నగర అభివృద్ధి సాధ్యమవుతుందని నల్లగొండ మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ బచ్చలకురి శరత్ చంద్ర అన్నారు. ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం రెండో విడతగా పలు వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వార్డు స్థాయిలో ప్రజల అవసరాలను గుర్తించి స్థానిక సమస్యలకు వేగవంతమైన పరిష్కారం చూపడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. చెత్తను మూలం వద్దనే వేరు చేయడం
ద్వారా పరిశుభ్రమైన నగర నిర్మాణంతో పాటు వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ సాధ్యమవుతుందన్నారు. జల్ సంచయ్- జల్ భాగీధారి కార్యక్రమంలో భాగంగా వర్షపు నీటి సంరక్షణ, ఇంకుడు గుంతల ఏర్పాటు, రూఫ్‌టాప్ రైన్ వాటర్ హార్వెస్టింగ్ చర్యల ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి కుటుంబం వర్షపు నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని, భూగర్భ జలాల పెంపునకు సహకరించాలని పిలుపునిచ్చారు.
రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలో చేపడుతున్న డ్రైనేజీల పూడికతీత పనులు, మురుగు కాలువల శుభ్రత, వర్షాకాల సన్నద్ధత చర్యల గురించి ప్రజలకు వివరించారు. డ్రైనేజీలలో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని, నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా చూడాలని సూచించారు. నగరంలో తాగునీటి సరఫరా, పైప్‌లైన్ నిర్వహణ, పారిశుధ్య సేవలు, వీధి దీపాల నిర్వహణ, అంతర్గత రహదారుల అభివృద్ధి, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిరంతరంగా చేపడుతున్నట్లు కమిషనర్ తెలిపారు. పచ్చదనం పెంపు ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం వల్ల దోమల వ్యాప్తిని నివారించడం, వ్యక్తిగత పరిశు భ్రత పాటించడం, తాగునీటిని శుద్ధి చేసి వినియోగించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని ప్రజలకు సూచించారు. వార్డు సభలలో ప్రజల నుండి తాగునీటి సరఫరా, పారిశుధ్యం, డ్రైనేజీలు, వీధి దీపాలు, రహదారులు, వర్షపు నీటి పారుదల, పార్కుల అభివృద్ధి, ప్రజా సౌకర్యాలు, ఇతర స్థానిక సమస్యలపై వినతులు, ఫిర్యాదులు, సూచనలు స్వీకరించారు. అందిన ప్రజా ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ప్రజా పాలన ? ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో నగర ప్రజలు చురుకుగా పాల్గొనాలని, రాబోయే విడతల వార్డు సభలకు కూడా పెద్ద సంఖ్యలో హాజరై తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత డివిజన్ల కార్పొరేటర్లు మందడి లిఖిత సైదిరెడ్డి, దొడ్డి రమేశ్, గోపరాజు స్వాతి రాజశేఖర్, మొహమ్మద్ ఇబ్రహీం, రఫియోద్దీన్, వార్డు అధికారులు, మున్సిపల్ అధికారులు, శానిటరీ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కరపత్రం
తెలుగు దిన పత్రిక
సోమవారం జూన్ 08, 2026

# రామచంద్రపూర్ కాలనీలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ జూన్ 7**



కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని 12వ డివిజన్ రామచంద్రపూర్ కాలనీలో రూ.17 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు అందించేందుకు సీసీ రోడ్లు, డ్రైనేజీలు , ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. రామచంద్రపూర్ కాలనీ ప్రజల దీర్ఘకాలిక అవసరమైన ఈ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయిన అనంతరం రాకపోకలు సులభతరం కావడంతో పాటు స్థానికులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని మేయర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు, కార్పొరేటర్ చొప్పరి జయశ్రీ వేణు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు , కాలనీవాసులు పాల్గొన్నారు

## రాష్ట్ర స్థాయి డ్రగ్ వ్యతిరేక అవేర్నెస్ ర్యాలీ

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 07:**



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ స్టేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సంస్కృతి భవన్ లో జూన్ 5న నిర్వహించిన రాష్ట్ర స్థాయి డ్రగ్ వ్యతిరేక అవేర్నెస్ ర్యాలీ, వర్క్‌షాప్ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ నుండి జిల్లా సెక్రటరీ సూర్యదేవర జ్యోతి, జిల్లా ఆర్గనైసింగ్ కమిషనర్లు మల్లారపు శంకర్, సుందరి, గైడర్ పావని ర్యాలీలో పాల్గొని సర్టిఫికెట్స్ పొందారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర గవర్నర్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ తెలంగాణ చీఫ్ పట్రాన్ శివప్రతాప్ శుక్ల తమ సందేశంలో ప్రతి వ్యక్తి సమాజంలో ఒక సైనికునిలా పనిచేసి డ్రగ్స్ రహిత రాష్ట్రంగా చేయాలని పిలుపునిచ్చారు. దేశంలో మన రాష్ట్రం డ్రగ్స్ మహమ్మారి 5వ స్థానంలో ఉన్నామని, దీనిని నిర్మూలించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు తమ పిల్లల్ని సరైన క్రమశిక్షణలో పెంచాలని తెలిపారు. డ్రగ్స్ వద్దు జీవితం ముద్దు అనే నినాదాన్ని ప్రచారం చేయాలన్నారు. ఎవరైనా అమ్మిన, వాడిన 1908 టోల్ ఫ్రీకి సమాచారం అందిశీచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ సెక్రటరీ యోగితా రాణా, స్టేట్ స్కౌట్ చీఫ్ కమీషనర్ దానికిషోర్, స్టేట్ సెక్రటరీ నవీన్ నికొలస్, సీనియర్ రిటైర్డ్ ఐఏఎస్ సందీప్ శాండిల్య, డ్రగ్స్ వల్ల యువతలో జరిగే నష్టాలు, దేశానికి జరిగే ప్రమాదాన్ని వివరించి దీనిని నివారించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని తెలిపారు. అన్ని జిల్లాల నుండి 400 మంది స్కౌట్స్ అండ్ గైడ్స్, జిల్లా బాధ్యులు పాల్గొన్నారు.

# భీమేశ్వర స్వామిని దర్శించిన అదిలాబాద్ ఎమ్మెల్యే

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామిని అదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆదివారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారికి ప్రీతికరమైన కోడె మొక్కును చెల్లించారు. ఆలయానికి చేరుకున్న ఆయనకుఅర్చకులు,వేద పండితులు ఘన స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ ఏఈవోలు జి. శ్రావణ్ కుమార్, గోవిందుల అశోక్ కుమార్ ఎమ్మెల్యే కు స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి లడ్డు ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి జాతర, కళ్యాణం



**కూకట్పల్లి జూన్ 7 కరపత్రం ప్రతినిధి**

టిపిసిసి ప్రధాన కార్యదర్శి శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ పూజిత దంపతుల ఆధ్వర్యంలో శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి జాతర, కళ్యాణం నల్లగండ్ల శ్రీకృష్ణ కాలనీ స్వామివారి ఆలయంలో ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ గారు కాంగ్రెస్ నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు కల్యాణానికి సంబంధించిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేల సంఖ్యలో హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నసంతర్పణ గావించారు. ఈ కార్యక్రమంలో గొట్టుముక్కల వెంకటేశ్వరరావు, ఉదయ్, అరవింద్ , గోపాల్ చౌదరి ,రంగమోహన్, ఆదినారాయణ ,తదితరులు పాల్గొన్నారు

### జర్నలిస్టుల హక్కుల కోసం నిరంతర పోరాట యోధుడు మామిడి సోమయ్య --

# జన్మదినం సందర్భంగా అన్నదాన కార్యక్రమం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట, జూన్ 7**

తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, సామాజిక భద్రత కోసం నిరంతరం పోరాడుతూ వేలాది మంది జర్నలిస్టులకు అండగా నిలుస్తున్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు మామిడి సోమయ్య 60వ జన్మదిన వేడుకలు కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు, సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

మామిడి సోమయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్ -- తిరుమల దంపతుల ఆధ్వర్యంలో జమ్మికుంట శివాలయం బొమ్మల గుడి వద్ద భక్తులకు, నిరుపేదలకు, ప్రజలకు ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ప్రజలు కార్యక్రమానికి హాజరై అన్నప్రసాదాన్ని స్వీకరించారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా మామిడి సోమయ్య పట్ల ఉన్న అభిమానాన్ని, గౌరవాన్ని కార్యకర్తలు చాటిచెప్పారు.

అనంతరం నిర్వహించిన జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పలువురు జర్నలిస్టు నాయకులు మాట్లాడుతూ, మామిడి సోమయ్య గత మూడు దశాబ్దాలుగా జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని



కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు.

టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్ మాట్లాడుతూ, జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ఎన్నో పోరాటాలు చేసి ప్రత్యేక గుర్తింపు పొందిన నాయకుడు మామిడి సోమయ్య అని అన్నారు. జర్నలిస్టులకు గుర్తింపు కార్డులు, ఆరోగ్య భద్రత, గృహ స్థలాలు, సంక్షేమ పథకాలు, ప్రమాద బీమా, పెన్షన్ వంటి అనేక అంశాలపై ప్రభుత్వాలతో నిరంతరం చర్చలు జరిపి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు.

జర్నలిస్టుల వృత్తి గౌరవాన్ని కాపాడేందుకు, వారి హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి సంఘటిత శక్తిగా తీర్చిదిద్దిన ఘనత మామిడి సోమయ్యదేనని ఆయన పేర్కొన్నారు. జర్నలిస్టులపై ఎక్కడైనా అన్యాయం జరిగినా ముందుండి స్పందిస్తూ, వారి కోసం పోరాడే నాయకుడిగా ఆయనకు ప్రత్యేక స్థానం ఉందన్నారు.

మామిడి సోమయ్య సేవలను గుర్తు చేసుకుంటూ పలువురు నాయకులు మాట్లాడుతూ, జర్నలిస్టు ఉద్యమాన్ని బలోపేతం చేయడంలో ఆయన పాత్ర ఎనలేనిదని కొనియాడారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం తన జీవితాన్నే అంకితం చేసిన వ్యక్తిగా ఆయన పేరు చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. నేటి తరం జర్నలిస్టులకు ఆయన మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

జమ్మికుంటలో నిర్వహించిన ఈ కార్యక్రమం జర్నలిస్టుల ఐక్యతకు ప్రతీకగా నిలిచిందని పలువురు అభిప్రాయపడ్డారు. జన్మదిన వేడుకలను కేవలం శుభాకాంక్షలకే పరిమితం చేయకుండా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశాన్ని అందించారని కొనియాడారు.

మామిడి సోమయ్య ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు జీవించాలని, జర్నలిస్టుల హక్కుల కోసం ఆయన చేస్తున్న పోరాటం మరింత బలపడాలని ఆకాంక్షిస్తూ పాల్గొన్న వారందరూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంతాటి రవీందర్, జర్నలిస్టు సంఘాల నాయకులు, జిల్లా, మండల స్థాయి జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని మామిడి సోమయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు

# రణ్‌వీర్ అండ్ శ్రేయాస్ స్పోర్ట్స్ స్టూడియో ఆధ్వర్యంలో ఘనంగా టైక్వాండో బెల్ట్ ప్రదానోత్సవం: విజేతలకు బెల్టులు అందజేసిన చేసిన గ్రాండ్ మాస్టర్ రమేష్!

**కరపత్రం ప్రతినిధి దిన పత్రిక మల్కాజిగిరి మండల**

కౌకూర్‌లోని రణ్‌వీర్ అండ్ శ్రేయాస్ స్పోర్ట్స్ స్టూడియోలో రణ్‌వీర్ అండ్ శ్రేయాస్ తైక్వాండో అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన తైక్వాండో బెల్ట్ ప్రదానోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ అకాడమీకి చెందిన 30 మంది విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబరిచి, ఈ బెల్ట్ పరీక్షల్లో పాల్గొన్నారు.

ప్రముఖ తైక్వాండో శిక్షకులు గ్రాండ్ మాస్టర్ రమేష్ పర్యవేక్షణలో కఠినమైన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న విద్యార్థులు, ఈ పరీక్షల్లో తమ నైపుణ్యాలను నిరూపించుకుని తదుపరి స్థాయి బెల్టులను సాధించారు. ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ రమేష్ చేతుల మీదుగా విద్యార్థులు తమ కొత్త



బెల్టులను, ధ్రువీకరణ పత్రాలను అందుకున్నారు.

**▪ గ్రాండ్ మాస్టర్ రమేష్ ప్రత్యేక ప్రశంసలు:**

ఈ సందర్భంగా గ్రాండ్ మాస్టర్ రమేష్ మాట్లాడుతూ.. పిల్లల్లో మానసిక ఉల్లాసానికి, శారీరక దృఢత్వానికి మరియు ఆత్మరక్షణకు తైక్వాండో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విద్యార్థులు చూపిన ప్రతిభను, వారి క్రమశిక్షణను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్తులో వీరు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా తీర్చిదిద్దడమే తమ అకాడమీ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

**▪ వెల్లివిరిసిన ఆనందం:**

గ్రాండ్ మాస్టర్ రమేష్ చేతుల మీదుగా ఉన్నత బెల్టులు అందుకోవడం పట్ల విద్యార్థులు ఎనలేని సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ వేడుకలో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని, పిల్లల ప్రదర్శనను చూసి మురిసిపోయారు. అకాడమీ అందిస్తున్న అద్భుతమైన శిక్షణ పట్ల, గ్రాండ్ మాస్టర్ రమేష్ చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

# హ్యాపీ సండే కార్యక్రమం అవసరం..

**- రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి**

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 07:**

ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రోత్సహించడానికి "హ్యాపీ సండే " కార్యక్రమం అవసరమని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన హ్యాపీ సండే కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత మార్చి నెలలో కూడా ఈ హ్యాపీ సండే కార్యక్రమాన్ని గోదావరి నదిలో చెత్త ఏరి వేసిన తరువాత క్రీడా పోటీలు నిర్వహించి ఘనంగా చేపట్టడం జరిగిందని అన్నారు. డిజిటల్ స్క్రీన్స్ కు అలవాటు పడి శారీరక, మానసిక సామర్థ్యాన్ని పెంచే యోగా, క్రీడలలో ప్రజలు భాగస్వాములు కాకపోవడం వలన రోగాల బారిన పడి హాస్పిటల్ చుట్టూ తిరుగుతూ డబ్బులు ఖర్చు పెట్టు కోవాల్సిన దుస్థితి అలాగే అనేక ఇబ్బందులు పడే పరిస్థితి కూడా తలెత్తుతుందని అన్నారు. ఈ నేపథ్యంలో మెట్రో నగరాలకు మాత్రమే పరిమితమైన ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికా 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో





భాగంగా చిన్న పట్టణాలు, నగరాల్లో కూడా చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఆరోగ్యంపై ఇప్పటికే కొంత మేర స్పృహ వచ్చిశీదని నగరంలోని మైదానాలలో చాలా మంది కనిపిస్తున్నారని అన్నారు. ఇది శుభ పరిమాణమని అన్నారు. మెప్మా సిబ్బంది సహకారంతో ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికతో పాటు అనేక కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందని అన్నారు. రామగుండం నగరాన్ని ఆరోగ్య నగరంగా తీర్చిదిద్దే ఎంఎల్ఎ ప్రయత్నంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమశీతో పాటు ప్రజల ఆరోగ్యం కూడా ప్రదానమని ప్రభుత్వం తలచి ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు.

అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె.అరుణ శ్రీ, నగర పాలక సంస్థ టిపిఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ శ్రీ పాల్, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మధుకర్ , మెప్మా టి ఎం సి మౌనిక, యోగా గురు గణేష్, వ్యాయమ ఉపాధ్యాయులు శోభారాణి, తిరుపతి, దావీద్ సిఓలు ఆర్పిలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ కార్యక్రమంలో భాగంగా యోగాతో పాటు కబడ్డీ, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. పోటీలో విజేతలకు మెమెంటో, బహుమతుల ప్రదానం చేశారు.

# మలేషియాలో వర్షిణి కళా ప్రదర్శన...

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని జూన్ 07:**

మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో జూన్ 6న కౌలంపూర్ మలేషియాలో జరిగిన తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు గోదావరిఖనికి చెందిన చెందిన యూట్యూబ్ స్టార్, బుల్లితెర నటి, జబర్దస్త్ ఫేమ్ వర్మని వర్షిణి పాల్గొని తన తెలంగాణ పాటలతో, జానపద పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు మైటా కార్యవర్గ సభ్యులు, మలేషియాకు చెందిన చాలామంది ప్రజలు పాల్గొన్నారు. అదేవిధంగా మనుకోట ప్రసాద్ సందీప్ అంజలి వంటి జానపద గాయకులు, ఆర్కెస్ట్రా బృందం కూడా పాల్గొన్నారు. మైటా సభ్యులు, కేటీఆర్ వర్షిని ఘనంగా సన్మానించారు. ఇంత చక్కటి అవకాశాన్ని అందుకుని విదేశాలలో ప్రదర్శనలు






ఇస్తున్న అమ్మాయిని ఈ సందర్భంగా రెయిన్బో స్కూల్ అధినేత పి.ఎస్ అమరేందర్, సర్వేష్ డ్యాన్స్ ఇన్స్టిట్యూట్ డాన్స్ మాస్టర్ సర్వేష్,



రెయిన్బో స్కూల్ ఉపాధ్యాయులు ఈ ప్రాంత అభిమానులు ఆ అమ్మాయిని అభినందిస్తూ ప్రశంసలు కురిపించారు. ఈ సందర్భంగా వర్షిని మాట్లాడుతూ తనని అభిమానిస్తూ ఆదరిస్తున్న వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# టీ-పీసీసీ రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన కిషన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వెంకట్రాం నరసింహారెడ్డి




**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 7**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీ–పీసీసీ) రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ను ఆదివారం హనుమకొండ జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు పింగిలి వెంకట్రాం నరసింహారెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతు సంక్షేమానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. హనుమకొండ జిల్లాలో కిసాన్ కాంగ్రెస్ చేపడుతున్న కార్యక్రమాలు, పార్టీ బలోపేతానికి చేపడుతున్న చర్యలను వెంకట్రాం నరసింహారెడ్డి టీ–పీసీసీ అధ్యక్షుడికి వివరించారు. పార్టీ సిద్ధాంతాలను గ్రామస్థాయికి తీసుకెళ్లడంలో కిసాన్ కాంగ్రెస్ కీలక పాత్ర పోషించాలని, రైతుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్రాం నరసింహారెడ్డి మాట్లాడుతూ.. టీ–పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందని, పార్టీ శ్రేణులకు ఆయన నిరంతరం అందిస్తున్న మార్గదర్శకత్వం, సమన్వయంతో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కాంగ్రెస్‌కు కొత్త ఉత్సాహం లభిస్తోందన్నారు. "రైతుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వం పార్టీకి గొప్ప బలంగా నిలుస్తోందన్నారు.

# తారుమారు అవుతున్న రాష్ట్ర రాజకీయం...!!!

- ఉచిత హామీలను నమ్మి మోసపోతున్న తెలంగాణ రాష్ట్ర ప్రజలు ...!!!
- ఉచిత హామీలతో పబ్బం గడుపుతున్న పరిపాలన ప్రజా నాయకులు
- తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఉచిత హామీలకేపరిమితమ...???
- రానున్న రాజకీయంలోనైనా తెలంగాణ రాష్ట్ర ప్రజలు మారుతారా...???

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట జూన్ 7**
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు అయితే తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుంది అనే ఉద్దేశంతోనే తెలంగాణ రాష్ట్ర ప్రజలు నిరసనలు ధర్నాలు చేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని 60 సంవత్సరాల సుదీర్ఘ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రఆకాంక్షను నెరవేర్చుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రజలు రాజకీయ నాయకుల చేతిలో గత 13 సంవత్సరాల క్రితం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటుతో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఉచిత హామీల పేరుతో రాజకీయ నాయకుల ఇష్టానుసారంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలను మోసభవితంగానే రాజకీయం అని ముసుకుతో రాష్ట్ర ప్రజల అలవాటు జననాడిని గమనించిన రాజకీయ నాయకులు వారి అవసరాల నిమిత్తం రాజకీయ పరిణామాలను ఉపయోగించుకుంటూ సంపాదన సుసంపంగా సంపాదించుకు నే విధంగానే రాజకీయ ముసుగులో సంపాదనకే అలవాటు పడిన ప్రజా నాయకులు ప్రజల శ్రేయస్సు కోసం ఏ ప్రజా నాయకులు పరిపాలనను







సాగించలేని చరిత్ర ఉన్నదా అని పలువురు ప్రశ్నించుకుంటున్నారు నేటి సమాజంలో ఎవరికి వారే యమునా తైరే అనే విధంగానే రాజకీయా పలుకుబడితో ఆస్తుల సంపాదనల అత్యాశలతోనే రాజకీయాలను చేస్తున్నారు గతంలో ఒక గ్రామానికి అత్యధికంగా విలువనిచ్చే గ్రామ సర్పంచ్ కి ఎంతో విలువ ఉండేది అని ప్రస్తుత రాజకీయాల పరిస్థితుల లో రాజకీయం అంటే తెలియని ప్రతి వ్యక్తి ఎన్నికలలో నిలబడి తమకు ఉన్నటువంటి ఆస్తులను సైతం అమ్ముకొని రాజకీయం చేసి ఎన్నికలలో నిలబడి గెలిచి సర్పంచి ఎంపీటీసీ జడ్పిటిసి అంటే తెలియని వ్యక్తులు కూడా గెలిచిన అనంతరం తమ పదవి అంటే ఏమిటో అనేది తెలియకుండా పరివర్తనతో ప్రవర్తించుతున్న ప్రస్తుత రాజకీయ చరిత్ర రానున్న రోజుల్లో రాజకీయం ఇలా ఉంటుందో తెలియలేని అయోమయ పరిస్థితులు ప్రస్తుత కాలా పరిమాణంలో సాగుతున్న పర్యాయాన్ని అంటూ అదుపు లేకుండా రాజకీయం సాగుతున్న తత్వంలో రానున్న రోజుల్లో రాజకీయం ఎలా ఉంటుందో ఎవరికి అంతుచిక్కలేని విధంగానే పరిస్థితులు అవలంబిస్తుండొచ్చు అని రాజకీయ అనుభవ ప్రజా నాయకులు అంటున్నారు ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన సజావుగా సాగుతున్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఎన్నో ఉచిత ఇచ్చి కుక్కకు బిస్కెట్ వేసినట్లుగానే పరిపాలన సాగుతుందని రైతు అని వ్యక్తికి ఎలాంటి విలువలు ఇవ్వకుండా రైతు పంట పెట్టుబడి కి వేస్తాను అన్న రైతు భరోసా సరైన సమయాలలో వేయకపోవడమే కాకుండా అప్పులు సోప్పులు చేసుకుని వరి పంటను పండించి వరి ధాన్యం కేంద్రాలకు తరలించిన ఇప్పటివరకు రైతులు పండించినటువంటి వరి ధాన్యాన్ని తీసుకోవడంలో జాప్యం ఎందుకు ప్రస్తుత రాజకీయంలో రైతులతోనే చెలగాటం ఆడుతున్నారు అని ఉదాహరణగా చెప్పుకోదగ్గ విషయమేనని రానున్న రోజుల్లో రాజకీయం ఎలా ఉంటుందో ఊహించుకోలేని పరిస్థితులు నేటి సమాజంలో ఏర్పడుతున్నాయని తెలంగాణ రాష్ట్ర ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

# వంజరి సమాజ ఆత్మగౌరవానికి ప్రతీకగా భవనం నిలవాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్



**కరపత్రం ప్రతినిధి బ్యూరో, జూన్ 7**
వంజరి సమాజం ఐక్యత, కష్టపడే స్వభావం, సామాజిక చైతన్యానికి ప్రతీక అని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ఉప్పల్ బాగయత్‌లో నిర్మించిన వంజరి కుల ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో విద్యాభ్యాసం చేసిన రోజుల జ్ఞాపకాలు తనకు ఇప్పటికీ గుర్తున్నాయని తెలిపారు. తాను ఎస్సీ హాస్టల్‌లో చదువుకున్నానని, ఆ సమయంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన హాస్టళ్లు ఉండేవని గుర్తు చేసుకున్నారు. అన్ని వర్గాల విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలనే ఆలోచన తనలో అప్పుడే బలపడిందన్నారు.
తర్వాత ఆర్థిక మంత్రిగా బాధ్యతలు నిర్వహించే సమయంలో తెలంగాణ లోని వివిధ సామాజిక వర్గాల పరిస్థితులను అధ్యయనం చేసి, వారి అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకునేందుకు కృషి చేశామని తెలిపారు. ప్రతి వర్గానికి ఆత్మగౌరవాన్ని పెంపొందించేలా హాస్టళ్లు, కమ్యూనిటీ హాళ్లు, ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చినట్లు చెప్పారు. సామాజిక వర్గాల అభ్యున్నతికి ఆత్మగౌరవ భవనాలు ఎంతో దోహదపడతాయని, అందుకే కులసంఘాల భవనాల నిర్మాణానికి ప్రభుత్వ స్థలాలను కేటాయించే చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. వంజరి సమాజం క్రమశిక్షణ, ఐక్యత, కష్టపడే తత్వం కలిగిన సమాజమని కొనియాడారు. ఈ ఆత్మగౌరవ భవనం కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాకుండా, వంజరి సమాజ చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, విలువలను భావితరాలకు చేరవేసే స్ఫూర్తి కేంద్రంగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజంలోని యువత విద్య, ఉపాధి, సామాజిక అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు ఈ భవనం వేదిక కావాలని అన్నారు. వంజరి సమాజ ప్రజలు ఐక్యంగా ముందుకు సాగి అన్ని రంగాల్లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు.
కార్యక్రమంలో వంజరి సమాజ పెద్దలు, యువత, మహిళలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆత్మగౌరవ భవన ప్రారంభోత్సవం సందర్భంగా వంజరి సమాజ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

# గంజాయి చాక్లెట్ల అక్రమ రవాణా భగ్నం

- ఒకరు అరెస్ట్ 72 గంజాయి చాక్లెట్లు స్వాధీనం



**కరపత్రం ప్రతినిధి వరంగల్, జూన్ 7**
వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మట్వాడ పోలీస్ స్టేషన్ పోలీసులు గంజాయి చాక్లెట్ల అక్రమ రవాణాను అడ్డుకొని ఒక వ్యక్తిని అరెస్టు చేసి 72 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జూన్ 6న సాయంత్రం మట్వాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ ఎస్. శివకృష్ణ సిబ్బందితో కలిసి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎంజీఎం సర్కిల్ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేశారు.అతని వద్ద ఉన్న నలుపు రంగు బ్యాగులో గంజాయి మిశ్రమంతో తయారు చేసిన చాక్లెట్లు లభించాయి.విచారణలో అతడు ఒడిశా రాష్ట్రంలోని భద్రక్ జిల్లా కాన్పాడాకు చెందిన జనార్ధన్ మాలిక్ (35)గా గుర్తించారు. సమాచారం అందుకున్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచులు,క్లూస్ టీం సమక్షంలో చట్టపరమైన ప్రక్రియ చేపట్టారు. నిందితుడు ఒడిశాకు చెందిన అంకిత్ పాణిగ్రహి వద్ద నుంచి గంజాయి మిశ్రమంతో తయారైన చాక్లెట్లను కొనుగోలు చేసి మహారాష్ట్రలోని సోలాపూర్ ప్రాంతంలో అధిక ధరకు విక్రయించి లాభం పొందాలని తీసుకెళ్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది.నిందితుడి వద్ద గోల్డ్ కలర్ కవర్లలో ప్యాక్ చేసిన మొత్తం 72 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.వాటిపై ముద్రించిన వివరాల ప్రకారం కనబిస్ సతివా తదితర పదార్థాలతో తయారు చేసినట్లు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.చాక్లెట్ల నుంచి గంజాయికి ప్రత్యేకమైన ఘాటైన వాసన వస్తుండటంతో అవి గంజాయి మిశ్రమంతో తయారైనవిగా నిర్ధారించినట్లు వెల్లడించారు.నిందితుడిపై సంబంధిత చట్టాల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మట్వాడ పోలీసులు తెలిపారు.

# భూపాలపల్లిలో సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం 29వ ద్వైవార్షిక మహాసభలు ఘనంగా నిర్వహణ -- నూతన కేంద్ర కమిటీ ఎన్నిక

**కరపత్రం ప్రతినిధి భూపాలపల్లి, జూన్ 7:**
భూపాలపల్లి ప్రాంతంలో సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం ఆధ్వర్యంలో 29వ ద్వైవార్షిక మహాసభలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహాసభలకు భారతీయ మజ్దూర్ సంఘ్ జాతీయ బొగ్గు పరిశ్రమల బాధ్యులు, కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ స్థాయీ సంఘ సభ్యులు, బొగ్గు పరిశ్రమ మరియు భవిష్య నిధి ట్రస్టు బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు.అలాగే భారతీయ మజ్దూర్ సంఘ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు వర్రె పూర్ణ, జాతీయ కార్యదర్శి మాధవన్ నాయక్ ముఖ్య అతిథులుగా పాల్గొని కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల అమలు, కార్మిక సంక్షేమమే సంఘం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తోందని



తెలిపారు. సింగరేణి అభివృద్ధితో పాటు కార్మికుల సంక్షేమానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.
మహాసభలో సంఘం గత కాలపు కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించి, భవిష్యత్ కార్యాచరణపై విస్తృత చర్చ జరిగింది. కార్మికుల ఐక్యతే సంఘ బలమని, ప్రతి కార్మికుడు సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నాయకులు పిలుపునిచ్చారు.
అనంతరం జరిగిన కేంద్ర కమిటీ ఎన్నికల్లో 2026 నుంచి 2028 సంవత్సరాల కాలానికి నూతన కేంద్ర కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూపాలపల్లికి చెందిన అప్పాని శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా వడ్డేపల్లి కుమారస్వామి, ఉప ప్రధాన కార్యదర్శిగా జి.వి. కృష్ణారెడ్డి ఎన్నికయ్యారు.
అలాగే భూపాలపల్లి ప్రాంతానికి చెందిన సతుకూరి శ్రీనివాస్, పాండ్రాల మల్లేష్ కార్యదర్శులుగా, ఎర్ల సదానందం నిర్వహణ కార్యదర్శిగా కేంద్ర కమిటీలో స్థానం పొందారు.
సభలో నాయకులు మాట్లాడుతూ సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, ఉద్యోగ భద్రత, సంక్షేమ పథకాల అమలు, సంస్థ అభివృద్ధి కోసం సంఘం మరింత బలోపేతంగా పనిచేస్తుందని తెలిపారు. కార్మికుల ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సంఘ ప్రతినిధులు, కార్మికులు, నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన కేంద్ర కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. నూతన కమిటీ నాయకత్వంలో కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# కాంగ్రెస్ కుట్రలతో సింగరేణి నిర్వీర్యం.. ప్రైవేటు పరం

- తెలంగాణ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్(రామగుండం), జూన్ 7:**
కాంగ్రెస్ కుట్రలతో సింగరేణి నష్టాల పాలవుతూ నిర్వీర్యం అవుతుందని.. సింగరేణి కార్మికుల జీతాలకు బ్యాంకుల నుంచి ప్రభుత్వం అప్పులు తీసుకుంటుందని బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలంగాణ మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తెలిపారు. 'కాంగ్రెస్ హటావో.. సింగరేణి బచావో'లో భాగంగా ఆదివారం ఎన్టిపిసి సమీపంలో నిర్వహించిన సింగరేణి సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మొదట గోదావరిఖనిలోని సిహెచ్పీని సందర్శించడానికి వెళ్తే ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రుల బృందాన్ని పోలీసులు అడ్డుకొనగా.. తిరిగి వచ్చిన ఆయన సదస్సులో పాల్గొని ప్రసంగించారు. సిరులు పండించిన సింగరేణి సంస్థలో నేడు ప్రైవేట్ కుట్రలకు కాంగ్రెస్ ఆజ్యం పోస్తుందని వివరించారు. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్




ప్రత్యేక శ్రద్ధ వహించి.. సింగరేణిని లాభాల బాటలోకి తీసుకువచ్చారని వివరించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ లో భాగంగా డిపెండెంట్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వందేనని వెల్లడించారు. సింగరేణిలో నలభై లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు ఉందని ప్రభుత్వం తప్పుడు లెక్కలు చూపిస్తుందని.. అందులోని నిజం తెలుసుకోడానికి వెళ్తే పోలీసులను పెట్టి ప్రభుత్వం అడ్డుకుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 400 మంది మెడికల్ ఫిట్ అయిన వారికి ఇంకా ఉద్యోగాలు కల్పించలేదని, లాభాల వాటాను తగ్గించి 16 శాతం మాత్రమే కార్మికులకు చెల్లించారని వివరించారు. తాము ఇచ్చిన డిపెండెంట్ ఉద్యోగాల్లో ఇప్పటి వరకు సగం మంది సింగరేణిలో పనిచేస్తున్నారని, ఇళ్ల స్థలాలను తమ ప్రభుత్వం రెగ్యులర్ చేశామని తెలిపారు. చంద్రబాబు రాగం రేవంత్ రెడ్డి పాడుతున్నారని, సింగరేణి కుప్పకూల పరిస్థితిలో ఉందని, దీని కోసం తాము నిరంతరం పోరాటానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. సింగరేణిలో ఓబీ కాంట్రాక్టు, సోలార్ పవర్, విద్యుత్ పరిశ్రమ కుంభకోణం తాము బయటికి తీస్తున్నామని వివరించారు. ఈనెల 12న భూపాలపల్లి ప్రాంతంలో పర్యటించి సింగరేణిలో జరుగుతున్న కుట్రలను కార్మికులకు వివరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, కౌశిక్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, పుట్ట మధు, నడిపెల్లి దివాకర్ రావు, టీబీజీకేఎస్ అధ్యక్షులు మిరియాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసు రామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకులు కౌశిక్ హరి, వ్యాళ్ల హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 80 పైగా సీట్లతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారు

**హైదరాబాద్ జూన్ 7 కరపత్రం ప్రతినిధి**
80 పైగా సీట్లతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతార ని కేసీఆర్ ఈ రాష్ట్రాన్ని ఏ విధంగా దోచుకుని అప్పులు చేశారో తెలంగాణ ప్రజలకు తెలుస ని ధనిక రాష్ట్రంగా సోనియా గాంధీ తెలంగాణ ను ఇచ్చారు.. పంది కొక్కుల్లా దోచుకుని రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశార ని ధ్వజమెత్తారు తెలంగాణ వచ్చినప్పుడు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, మీరు దిగిపోయినప్పుడు ఉన్న పరిస్థితి పైన కేటీఆర్ విదేశాల్లో స్పీచ్ లు ఇవ్వాల ని 25 యేళ్ల పాలన కాదు వచ్చే రెండున్నర యేళ్లు మీ పార్టీని కాపాడుకోండి చాలు తెలంగాణ లో మీ పార్టీ అవసరం లేదని ప్రజలు ఇప్పటికే పలు సార్లు సంకేతాలు ఇచ్చార ని అన్నారు ప్రతి పక్షంగా ఫైయిల్ కావడంతో పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు తుక్కు తుక్కు ఓడించారు..అయినా బుద్ధి రావడం లేద ని పంచాయతీ ఎన్నికల్లో పత్తా లేకుండా పోయారు..మున్సిపల్ ఎన్నికల్లో మీ మోహం మీద ఛీ కొట్టార ని పేర్కొన్నారు జూబ్లీహిల్స్, కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో రేవంత్ రెడ్డి నాయకత్వం కావాలని ప్రజలు స్పష్టంగా తీర్పు ఇచ్చార ని డబ్బు మదంతో ఏమైనా చేస్తామన్న అహంకారంతో దేశాలు తిరిగి తప్పుడు ప్రచారం చేస్తున్నారు.. మీరెన్ని దేశాలు తిరిగినా తెలంగాణ ప్రజల గుండెల్లో రేవంత్ రెడ్డి ఉన్నార ని తెలిపారు దేశంలో ఏ రాష్ట్రం ఇవ్వని సంక్షేమ పథకాలను మా ప్రభుత్వం ఇస్తోంది.. ప్రజల్లో గుండెల్లో రేవంత్ రెడ్డి ఉన్నారు..మళ్లీ 80 పైగా సీట్లతో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారు.. కేటీఆర్ కు దమ్ముంటే చేతనైతే ఆపాల ని సవాల్ విసిరారు ప్రతి పక్ష హోదా కూడా ఈ సారి బీఆర్ఎస్ కు రాద ని అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ని ,తెలంగాణ ప్రజలను తక్కువ అంచనా వేశారు.. తెలంగాణ ప్రజలను వానపాముల్లా చూశారు.. కాని అవే వానపాములు బుసలు కొట్టి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చివేశాయ ని తెలిపారు తెలంగాణ ప్రజలు చైతన్యవంతుల ని తెలంగాణ ప్రజలు ఆకలినైనా భరిస్తారు కాని ఆత్మగౌరవాన్ని వదులుకోలేరు..తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ ను ఎప్పటికి క్షమించరు.. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు కూడా దొరకర ని జోస్యం చెప్పారు బీఆర్ఎస్ అభ్యర్థులకు డిపాజిట్లు రావు..అబద్దాలకు బ్రాండ్ అంబాసిడర్ కేటీఆర్ అని రాష్ట్రంలో చెపుతున్న అబద్దాలు సరిపోలేదని మలేషియా వెళ్లి అబద్దాలు చెపుతున్నాడ ని పదేళ్లు ఒక్క ఇళ్లు ఇవ్వలేదు.. కనీసం రేషన్ కార్డు ఇవ్వలేదు.. ఏ మోహం పెట్టుకుని మాట్లాడుతున్నారు..మళ్లీ రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం బాగుపడుతుందని ప్రజలు భావిస్తున్నార ని అన్నారు 80 కి పైగా సీట్లతో మరో సారి కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది.. రేవంత్ రెడ్డి మళ్లీ సీఎం అవుతాడుబీఆర్ఎస్ పార్టీకి సింగిల్ డిజిట్ సీట్లు కూడా రావ ని తెలంగాణ ప్రజలు కేసీఆర్ ను చూసి ఛీదరించుకుంటున్నారు.విదేశాల్లో ప్రసంగాలు దంచేముందు పదేళ్లు మీరు చేసిన దోపిడి, అకృత్యాలు, నియంత పాలన పైన ముందు క్షమాపణ చెప్పాల ని డిమాండ్ చేశారు